
మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి : మంత్రి

దుండిగల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎన్నికల సన్నాహక సమావేశం బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. బీ-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని చూస్తుంటే విజయం తప్పక వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ ఎమెల్యే మైనంపల్లి హన్మంతరావు, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కొలన్ హన్మంత్‌రెడ్డి, కేఎం ప్రతాప్ పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌లో చేరిక

నిజాంపేట్: నిజాంపేట్ మాజీ ఎంపీటీసీ ఆవుల సురేష్ యాదవ్ 150 మంది అనుచరులతో బహదూర్‌పల్లి మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బక్క మల్లేష్, ఎస్ కుమార్‌యాదవ్‌లతో పాటు కొంత మంది చేరారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మియాపూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన చేవెళ్ల పార్లమెంట్ ఆత్మీయ సమ్మేళనంలో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు. చేవవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని తెలిపారు.


కార్పొరేటర్లు, ముఖ్యనాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలి: ఎమ్మెల్యే

వివేకానందనగర్‌కాలనీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామన్నారు. వివేకానందనగర్‌కాలనీలోని తన నివాసంలో మంగళవారం ఆయన పార్టీ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులతో సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హమీద్‌పటేల్, నాగేందర్‌యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, మాధవరం రంగారావు, నాయకులు మోహన్‌గౌడ్, గణేశ్, సంజీవరెడ్డి, రఘునాథరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, గౌతమ్‌గౌడ్, పెద్ద భాస్కర్‌రావు, పోతుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

29న కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

కూకట్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఈనెల 29న ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు చేయాల్సిన విధులపై అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని రమేష్ పిలుపునిచ్చారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

కూకట్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు పాదచారుల భద్రత దృష్ట్యా ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నామని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. మూసాపేట సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్లలో పలు చోట్ల ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలంటూ జెడ్సీ ఇచ్చిన ఆదేశాల మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగారు. కేపీహెచ్‌బీకాలనీలోని సర్వీసురోడ్డుతో పాటు రోడ్డునెంబర్ 2, 3ల్లోని రోడ్డు ఆక్రమణలు, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ... ఫుట్‌పాత్ ఆక్రమణలపై తరచూ ప్రత్యేక డ్రైవ్స్ కొనసాగిస్తామన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రజలు స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామని ఈ సందర్భంగా తెలిపారు.


ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

ఈతను పాఠ్యాంశంలో చేర్చాలి

షాపూర్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఈతను పాఠ్యాంశంగా చేర్చాలని సామాజిక కార్యకర్త, ప్రకృతి ప్రేమికుడు రవిందర్ ముదిరాజ్ అన్నారు. ఈత రాక ఎంతో మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఈతను పాఠ్యంశంలో చేర్చాలని ఎన్నో ఏళ్లుగా అధికారులకు, ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించడం, ఉద్యమం చేయడం జరుగుతందన్నారు. హోళీ పండుగను పురస్కరించుకొని సోమవారం తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో 11 మంది మృత్యువాత పడ్డారని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఈత నేర్పించాలని కోరారు.


లక్ష్మి, ఆంజనేయులుకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజేందర్

ఈటల సమక్షంలో బీజేపీలో చేరికలు

దుండిగల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్‌కు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎంబరి లక్ష్మి ఆంజనేయులు మేడ్చల్ నియోజకవర్గం బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ల సమక్షంలో బీజేపీలో చేరారు. మంగళవారం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్‌లోని ఎస్ఎంఎన్ఆర్ గార్డెన్‌లో బీజేపీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంజనేయులుతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండిగూడెం గణేశ్, గానుల బాలరాజు, కొండా శ్రీకాంత్‌తో పాటు దాదాపు రెండొందల మంది బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, కౌన్సిలర్ రామ్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్, కౌన్సిలర్ రాజిరెడ్డి, మల్లేష్‌యాదవ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మార్తాండనగర్‌లో ఇఫ్తార్

మియాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసం పురస్కరించుకుని హఫీజ్‌పేట మార్తాండనగర్‌లో మంగళవారం సాయంత్రం ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ హాజరయ్యారు. పండుగలు ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిపాల్‌యాదవ్, మన్నేపల్లి సాంబశివరావు, ఎండి బషీరుద్దీన్, ఎండి గౌసుద్దీన్, అలీ, రషీద్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో జగదీశ్వర్‌గౌడ్, తదితరులు

వీధిన పడేశారు

- తోపుడుబండ్లు, సామగ్రినీ ధ్వంసం చేసిన జీహెచ్ఎంసీ సిబ్బంది
- అయోమయంలో వీధివ్యాపారులు
- న్యాయం చేస్తామని డీసీ హామీ

కుత్బుల్లాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది విచక్షణారాహిత్యం కారణంగా వీధి వ్యాపారుల బతుకులు వీధిన పడ్డాయి. రోజూ రెక్కాడితేనే కానీ.. డొక్కాడని చిరు వ్యాపారులపై వారు తమ ప్రతాపం చూపించారు. తెల్లవారక ముందే ప్రొక్లెయిన్‌తో దాడి చేసి చిరు వ్యాపారాలు, తోపుడుబండ్లను, ఇతరాత్ర సామగ్రి ధ్వంసం చేశారు. వీధి వ్యాపారులు ఉదయం వచ్చి చూసేసరికి వారి వస్తువులు నేలమట్టమైయ్యాయి. ఈ ఘటన గాజులరామారం సర్కిల్ పరిధి షాపూర్‌నగర్ మార్కెట్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. వీధి వ్యాపారులు ఆగ్రహంతో అధికారులు నిలదీశారు. నిరసనతో పాటు సర్కిల్ కార్యాలయ ముట్టడించారు.

వ్యాపారుల సంఖ్య పెరగడంతో..

షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులో సుమారు 30 ఏళ్ల నుంచి కూరగాయలు, పండ్లు, పూలతో పాటు ఇతరత్రా చిరువ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కాలక్రమంలో వ్యాపారుల సంఖ్య పెరగడంతో రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందస్తు సమాచారం లేకుండా మంగళవారం తెల్లవారుజాము ప్రొక్లెయిన్‌తో విచక్షణారహితంగా తోపుడు బండ్లు, సామగ్రిని తొలగించింది. దీంతో బండ్లు, ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి. వ్యాపారుల తోపుడుబండ్లు, సామగ్రిని జప్తు చేసి కార్యాలయానికి తరలించాల్సింది పోయి ధ్వంసం చేయడంతో వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిలదీత.. కార్యాలయం ముట్టడి

ఆక్రమణల తొలగింపులో సిబ్బందికి, వీధి వ్యాపారులకు మధ్య వివాదం నెలకొంది. గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లయ్య అక్కడకు చేరుకుని జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. దీంతో వ్యాపారులు సుమా రు రెండున్నర గంటల పాటు అధికారులు, సిబ్బందితో పాటు డీసీని కదలనివ్వలేదు. అనంతరం వీధి వ్యాపారులు సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడించారు. విషయాన్ని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ దృష్టికి రావడంతో కార్పొరేటర్ రావుల శేషగిరితో కలిసి అక్కడకు చేరుకొని డీసీ మల్లయ్యతో చర్చించారు.


మార్కెట్‌లో జీహెచ్ఎంసీ సిబ్బంది ధ్వంసం చేసిన తోపుడు బండ్లు, స్టాండ్లు

బాధ్యులను సస్పెండ్ చేయాలి: ఎమ్మెల్యే

వ్యాపార సముదాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే ముందస్తు సమాచారం అందించకుండా ఇష్టానుసారం చిరువ్యాపారుల సామగ్రి ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకొని వారిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ముందస్తు సమాచారం లేకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది విచక్షణ కోల్పోయి అలా ఎలా వ్యవహరిస్తారని మండిపడ్డారు. వ్యాపారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డీసీని ఆదేశించారు.

అక్రమ షెడ్లను తొలగించలేదు



జీహెచ్ఎంసీ అధికారులు ఇష్టానుసారం వ్యాపారాలను తొలగించారు. రోడ్డుపై ఉన్న దుకాణాలతో పాటు రోడ్డు లోపలికి ఉన్న మా దుకాణాలను కూడా తొలగించారు. మాలాంటి పేదల తోపుడుబండ్లు, సామగ్రిని ధ్వంసం చేసిన సిబ్బంది అక్రమంగా రోడ్డుపైకి షెడ్లు వేసుకొని అద్దెలు వసూళ్లు చేస్తున్న వారిని ఏమీ అనకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

- నాని, ఉల్లిపాయల వ్యాపారి

సమాచారం ఇవ్వకుండా తొలగించారు



మేము రోజూ ఆకుకూరలు అమ్ముకొని వచ్చిన దాంతో జీవనం సాగిస్తున్నాం. జీహెచ్ఎంసీ సిబ్బంది మా స్టాండును విరగకొట్టారు. స్టాండును తీసుకుంటామని చెప్పినా వినలేదు. 30 ఏళ్లుగా షాపూర్‌నగర్ మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకుంటున్న మా దుకాణాలను ఎటువంటి సమాచారం అందించకుండా తొలగించారు. అధికారులు మాకు తగిన న్యాయం చేయాలి.

- రామచంద్ర, ఆకుకూరల వ్యాపారి

బాధ్యులైన సిబ్బందికి తాఖీదులు ఇచ్చాం

షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డు ఆక్రమణల తొలగింపులో మనుషులతో చేయించాల్సిన పనులను ప్రొక్లెయినర్‌తో చేయించారు. దీంతో అక్కడ తోపుడుబండ్లు, సామగ్రి ధ్వంసమైన మాట వాస్తవమే. నష్టం జరిగిన వారిని దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు తీసుకుంటాం. వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డును మంజూరు చేసి తగిన ప్రదేశంలో స్థలాన్ని కేటాయించే చర్యలు తీసుకుంటున్నాం. విచక్షణ లేకుండా వ్యవహరించిన సిబ్బందికి తాఖీదులు (మెమోలు) జారీ చేశాం.

- ఎలోపే మల్లయ్య, ఉప కమిషనర్, గాజులరామారం




విష్ణు సహస్రనామ సామూహిక మహాపారాయణంలో ఎమ్మెల్యే గాంధీ

విష్ణు సహస్రనామ మహాపారాయణం

మియాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ముచ్చింతల్‌లోని సమతామూర్తిస్ఫూర్తి కేంద్రంలో త్రిదండి చినజీయర్ స్వామి మంగళశాసనాలతో నిర్వహించిన 12వ శ్రీవిష్ణు సహస్రనామ సామూహిక మహాపారాయణంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో సీవీఆర్ చానల్ చైర్మన్ చలసాని వెంకటేశ్వరరావు, కమ్మమహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

చందానగర్: హఫీజ్‌పేట డివిజన్ హుడాకాలనీ జమదగ్ని మహాముని, రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ప్రత్యేక పూజలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గణపతి హోమం, పుణ్యాహవచనం, జమదగ్ని, రేణుక ఎల్లమ్మ విగ్రహాలకు అభిషేక అర్చనలు చేసి ఘనంగా కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

యుసుఫ్‌గూడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. రహ్మత్‌నగర్ ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో నిఘా పెట్టారు. కార్మికనగర్ ప్రాంతంలో ఎం.రవి మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించి, అతడిని అదుపులోకి తీసుకొని 27 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కాపర్ కేబుల్ చోరీ

యుసుఫ్‌గూడ: ఎయిర్‌టెల్ సైట్‌లో ఉన్న కాపర్ కేబుల్‌ను చోరీ చేశారు. బేగంపేటకు చెందిన జె.శ్రీనాథ్ ఓ ప్రైవేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. జనవరి 10న అమీర్‌పేట చౌరస్తా సమీపంలో ఉన్న ఎయిర్‌టెల్ సైట్‌లో అలారం మోగింది. వెంటనే శ్రీనాథ్ తన సహచర ఉద్యోగితో కలిసి వెళ్లి చూసే సరికి అక్కడ ఉండాల్సిన 10మీటర్ల కాపర్ కేబుల్ కనిపించలేదు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించగా ఓ అగతంకుడు దొంగిలించినట్టు తెలిసింది. అతడి కోసం ఎంత గాలించినా ఫలితంలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బస్సు డ్రైవర్లపై కేసు

యుసుఫ్‌గూడ: అనుమతిలేని సమయంలో బస్సులను తీసుకొచ్చిన డ్రైవర్లపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్ ఇబ్రహీం, షేక్ ఇస్మాయిల్ అనే వ్యక్తులు అనుమతి లేకుండా ప్రైవేట్ ట్రావె ల్ బస్సులను నగరంలోకి తీసుకొచ్చారు. దీంతో అమీర్‌పేట మెట్రో వద్ద మధురానగర్ పోలీసులు నిలిపివేసి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

పంజాగుట్ట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై స్నేహితులతో కలిసి వెళ్తున్న యువతి చేతిలో నుంచి బ్యాగు లాక్కెళ్లిన్న ఘటనలో మంగళవారం పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఏపీలోని అద్దంకి ప్రాంతానికి చెందిన హిమజ మాదాపూర్ దుర్గం చెరువు సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటుంది. ఈ నెల 24న రాత్రి స్నేహితులతో కలిసి అమీర్‌పేట్‌కు వచ్చింది. భోజనం చేసిన అనంతరం స్నేహితుడు జానీ భాషాతో కలిసి ద్విచక్ర వాహనంపై హాస్టల్ కు బయలుదేరింది. మార్గం మధ్యలో వీరి ద్విచక్రవాహనాన్ని వేరే వాహనంపై వచ్చిన ముగ్గురు అగంతకులు అడ్డుకున్నారు.పెనుగులాటలో ఆమె కింద పడగా ఆమె చేతులో ఉన్న బ్యాగును లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. స్నాచింగ్‌కు పాల్పడ్డ ముగ్గురిని నగర టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. వారి నుంచి ద్విచక్ర వాహనం, సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

టీ హబ్‌లో 'ఈవెంట్ నీడ్జ్'

రాయదుర్గం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈవెంట్ ఇండస్ట్రీ వృత్తి నైపుణ్యంతో పని చేయాలని తెలంగాణ ఐటీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తెలిపారు. మంగళవారం గచ్చిబౌలిలోని టీహబ్‌లో ఈవెంట్ నీడ్జ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెంటల్స్, సేల్స్ వెండర్‌లతో వినియోగదారులను కనెక్ట్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీహబ్ సీఈవో అనీష్‌ఆంథోని, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ ఎస్ గ్లోరి స్వరూప, టీసీఈఐ అధ్యక్షుడు బలరాంబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జయేష్ రంజన్

ఏజెంట్లు లేకనే వెనుకబాటు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో దాదాపు రెండు వేల పోలింగ్ బూత్‌లున్నాయి. ఇందులో దాదాపు 300 నుంచి 500 పోలింగ్ బూత్‌లు బస్తీలు, గల్లీల్లో ఉన్నాయి. అలాంటిచోట్ల బీజేపీ ఇప్పటివరకు ఏజెంట్లను నియమించుకోలేక పోయింది. ఈసారి ఎలాగైనా ఏజెంట్లను నియమించుకోవాలని బీజేపీ కసరత్తు చేస్తోంది. సమర్థులైన కార్యకర్తలను గుర్తించి, వారికి తగిన భరోసా ఇచ్చి ఏజెంట్లుగా పంపాలని ప్రణాళికలో ఉన్నది. గట్టి బందోబస్తు, ఏజెంట్ల నియామకం ద్వారా హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో బోగస్ ఓట్లను నిలువరించవచ్చని బీజేపీ భావిస్తోంది. అంతేకాకుండా, గతంలో తొలగించిన దాదాపు లక్షన్నర మంది ఓట్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్పించినట్లు బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఆ ఓట్లు తమకు లాభిస్తాయని భావిస్తున్నారు. ఇంకా దాదాపు నాలుగున్నర లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఒక్కొక్క ఇంట్లో వందల సంఖ్యలో ఓటర్ల పేర్లు ఉన్నాయని, ఖాళీ స్థలాల చిరునామాలో కూడా ఓటర్ల పేర్లు నమోదు అయినట్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఓట్లను అడ్డుకుంటే బీజేపీ లాభిస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతో ఈ దిశగా పార్టీ శ్రేణులు దృష్టి సారించినట్లు చెబుతున్నారు. అలాగే పేద మైనారిటీ వర్గాలను ఆకట్టుకునేందుకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి మాధవీలత కొంత కాలంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నాయకులు చెబుతున్నారు. పోలింగ్ నాడు బూత్ ఏజెంట్లను పెట్టకపోవడంతో ఓటింగ్ ఇష్టానుసారంగా జరిగే అవకాశం ఉంటుందని, అందువల్ల ఏజెంట్లపై దృష్టి సారించాలన్న నిర్ణయానికి వచ్చారు.

● 1980 నుంచి పోరాటం

1962లో జరిగిన ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి జనసంఘ్ పోటీ చేసింది. 1980లో జనసంఘ్ జనతాపార్టీలో విలీనం కావడంతో ఆలె నరేంద్ర ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1,35,304 ఓట్లు సాధించారు. 1991, 1998, 1999 ఎన్నికల్లో పోటీ చేసిన బద్దం బాల్‌రెడ్డి కూడా ఓడిపోయారు. కానీ, మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చిన నాయకుడిగా గుర్తింపు పొందారు. 1991లో ఆయన 42.2 శాతం ఓట్లు సాధించడం విశేషం. 2004 ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి సుబాష్‌చందర్‌జీ పోటీ చేసి 2 లక్షలా 78 వేల ఓట్లు సాధించారు. 2009లో సతీష్ అగర్వాల్ పోటీ చేసినా, కనీస ఓట్లు సాధించలేకపోయారు. అప్పటి నుంచి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ ప్రాభవం తగ్గుతూ వచ్చింది. 2014లో స్థానికంగా పట్టు ఉన్న భగవంతరావును బరిలోకి దింపడంతో ఆయన గట్టి పోటీ ఇచ్చి దాదాపు 3,11,414 ఓట్లు సాధించారు. ఓడిపోయినా పాతబస్తీలో బీజేపీకి ఆదరణ ఉందని నిరూపించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో భగవంతరావు మళ్లీ పోటీ చేసి ఓడిపోయారు. ఈ లోక్‌సభ స్థానం నుంచి నాలుగు సార్లు కాంగ్రెస్, ఒకసారి తెలంగాణ ప్రజా సమితి విజయం సాధించింది. వరుసగా 12 సార్లు మజ్లిస్ పార్టీయే గెలిచింది. ఆలే నరేంద్ర, బద్దం బాల్‌రెడ్డి వంటి నేతలు మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చినా మజ్లిస్‌ను నిలువరించి ఎంపీగా గెలవలేకపోయారు.

● పూర్వ వైభవం కోసం

పాతబస్తీలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తూ వచ్చిన బీజేపీ ఇప్పుడు మజ్లిస్‌కు దాదాపు సమఉజ్జీగా ఉందని చెప్పాలి. అసెంబ్లీ, పార్లమెంట్, కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలే బలంగా పోటీ పడుతున్నాయి. మజ్లిస్ కంచుకోటను బీటలు కొట్టి మళ్లీ పూర్వవైభవం పొందాలనే ప్రణాళికలో ఈసారి విరించి ఆస్పత్రుల ఛైర్‌పర్సన్ మాధవీలతకు హైదరాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చారు. ఆమె కొంతకాలంగా ధార్మిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల ద్వారా స్థానికంగా పేరొందారు. టికెట్ ప్రకటించక ముందు నుంచే పాతబస్తీలో హైందవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజల ఆలోచనల్లో మార్పు, చైతన్యం తీసుకురావడం ద్వారా వారి మద్దతును కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బంగారం, వెండి నగలను అపహరించుకు పోయారు. కిస్మత్‌పూర్ శివసాయి కాలనీలో ఉంటున్న లోకేశ్ ఇంటికి తాళం వేసి ఆదివారం బంధువుల వద్దకు వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి రాగా, తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. మంగళవారం లోకేశ్ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణా జిల్లాకు చెందిన నాగబసవయ్య కుమారుడు పినాటి వెంక ట శివాజీ(38) బతుకు దెరువు కోసం కుటుంబసభ్యులతో 7 ఏళ్ల క్రితం వలస వచ్చి కుత్బుల్లాపూర్ ఎంఎన్‌రెడ్డి నగర్ ఫేజ్-2లో నివాసం ఉంటూ, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. కరోనా సమయంలో సరిగా పని లేక అప్పుల పాలు కావడంతో మనస్తాపం చెందిన వెంకటశివాజీ సోమవారం రాత్రి ఇంట్లో కుమారులు నిద్రిస్తుండగా ఉరివేసుకున్నాడు. ఆ సమయంలో ఆరుబయట కూర్చున్న శివాజీ భార్య లోపలికి వెళ్లి చూడగా ఆయన ఉరి వేసుకుని కనిపించాడు. భార్య చుట్టు ప్రక్కల వారు వచ్చి కిందికి దించి చూచేసరికి అప్పటికే అతడు మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబీకులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

గృహిణి ఆత్మహత్య

జీడిమెట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ గృహిణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త, అత్త వేధింపులతోనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట్ మండలం, జయన్న తిరుమలపురానికి చెందిన కావలికిష్టయ్య కుమార్తె ఉమామహేశ్వరి (22), ఆయన మేనల్లుడు నాగరాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. నాగరాజు కుటుంబసమేతంగా అపురూపకాలనీలో ఉంటూ జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబంలో గొడవల కారణంగా సోమవారం రాత్రి ఉమామహేశ్వరి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి భర్తను అదుపులోకి తీసుకున్నారు.


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జేఎన్‌టీయూలో అగ్ని ప్రమాదం

హైదరాబాద్ సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ క్యాంపస్‌లో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్లాస్‌రూమ్స్ గోడలకు ఆనుకొని పోగయిన చెత్తాచెదారం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో.. గమనించిన సిబ్బంది వర్సిటీ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సమాచారం అందించారు. క్యాంపస్‌లోని న్న ఫైరింజన్‌ను పిలిపించి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు గంట పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించారు. లంచ్ అవర్ కావడంతో విద్యార్థులెవరూ అటువైపు రాకపోవడంతో ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు. విషయం మెకానికల్ విభాగం నుంచి పాడైన వస్తువులు, కెమికల్స్ ఉన్న బ్యాటరీలు పడేయడంతో ఎండకు అవి మండి మంటలు చెలరేగాయని కొందరు చెబుతున్నారు.

అనుమతులకు మించి అంతస్తుల నిర్మాణం

నిజాంపేట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని రుద్ర కన్‌స్ట్రక్షన్ పి.నవీన్ అనే వ్యక్తి తప్పుడు అనుమతి పత్రాలు చూపి స్తూ అదనపు అంతస్తుల నిర్మాణం చేయడంతో పాటు సెట్‌బ్యాక్ లేకుండానే అపార్టుమెంట్ నిర్మిస్తున్నారని స్థానికులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో అపార్టుమెంట్ల వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ.. రుద్ర కన్‌స్ట్రక్షన్‌కు అక్రమ అనుమతులతో అదనపు అంతస్తులు నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. ఇదంతా స్థానిక బీఆర్ఎస్ నాయకుల సహకారంతోనే జరిగిందని, అక్రమ నిర్మాణాలపై కమిషనర్ రామకృష్ణారావుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి కన్‌స్ట్రక్షన్ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, అరుణ్‌రావు, మాధవరావు, హనుమయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


బహుళ అంతస్తుల భవనాలు

వాహనాలను దొంగిలించిన ముగ్గురి రిమాండ్

జీడిమెట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై, జల్సాల కోసం ఇళ్ల, దుకాణాల ముందు పార్కు చేసిన వాహనాలను దొంగిలించి, సొమ్ము చేసుకుంటున్న ముగ్గురు ముఠా సభ్యులను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రూ.6.65 లక్షల రూపాయాల విలువ చేసే 17 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం ప్రాంతంలోని షైహాబానగర్‌కు చెందిన గోగుల దేవసహాయం(27), మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం, ధర్మసాగర్‌కు చెందిన రెడ్డి రమేష్‌లు వాహనాలను దొంగిలించి విక్రయించి జల్సాలు చేసేవారు. వీరిద్దరు తరచూ షాపూర్‌నగర్ కల్లుకాంపౌండ్‌లో మద్యం సేవిస్తుంటారు. డబ్బుల కోసం వీరు జీడిమెట్ల, సూరారం, జగద్గిరిగుట్ట, నర్సాపూర్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, మెదక్ పట్టణం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 17వాహనాలు దొంగిలించారు. వాటిని షాపూర్ నగర్, కళావతినగర్‌కు చెందిన మన్నే రాజు(35) కుదువ వ్యాపారికి విక్రయిస్తుంటారు. విక్రయించిన సొమ్మును కె.శివకుమార్‌గౌడ్ వద్ద దాచిపెడుతుంటారు. వీరిపై నిఘాపెట్టిన పోలీసులు ఈనెల 25వ తేదీన దేవసహాయం, రెడ్డి రమేష్, మన్నేరాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 17 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శివకుమార్ పరారీలో ఉన్నట్టు జీడిమెట్ల సీఐ శ్రీనివాసరావు, డీఎస్ఐలు డి.విజయ్‌నాయక్, దర్మయ్య రాథోడ్‌లు తెలిపారు.


వాహనాలను దొంగిలించిన నిందితులు